లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాల్లో

విజయం ఖాయం

రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి


సుభాష్‌నగర్‌లో ఈటల రాజేందర్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మల్లారెడ్డి

జీడిమెట్ల: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 పైచీలుకు స్థానాలు కైవసం చేసుకుని హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. సోమవారం సుభాష్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తెచ్చేందుకు ఈటల రాజేందర్‌ను గెలిపించుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ సెల్ నాయకుడు పత్తి రఘుపతి, కేశవ్‌యాదవ్, డివిజన్ల అధ్యక్షులు పులి బలరామ్, దుర్యోధనరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్ రంగంపేట, భీమరాజు, అంజయ్య, భానుగౌడ్, చందు, శ్యామ్ కిరణ్ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి తొలి ప్రాధాన్యం


నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన మహిళా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి


నిజాంపేట్: మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని.. అందులో భాగంగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి అన్ని డివిజన్ల మహిళా కాంగ్రెస్ పార్టీ కమిటీలను జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హన్మంతరెడ్డి మహిళా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫియా బేగం, సెక్రటరీ జాజుల రమ్య, అన్ని డివిజన్ల మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ మార్టిన్స్'పై విద్యార్థి సంఘం ఫిర్యాదు


ఉన్నత విద్యాశాఖ చైర్మన్ లింబాద్రికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కుత్బుల్లాపూర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను నిలువు దోపిడీ చేస్తోందని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రిని కలిసి కళాశాల యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన మొదలుకుని ప్రాజెక్టులు, వర్క్‌షాప్‌ల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యమైన విద్యార్థుల నుంచి అదనంగా రూ.20 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పుస్తకాల కళాశాల నుంచే కొనుగోలు చేయాలనే నిబంధనలు పెడుతూ ఒక్కో సెమిస్టర్‌కు రూ.12వేలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎగ్జామ్స్ సమయంలో సైతం ఫీజుల పేరుతో డబ్బులు గుంజుతున్నారని ఆరోపించారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓయూ జేఏసీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కో.ఆర్డినేటర్ సురేందర్, కార్యదర్శి సంతు తదితరులు పాల్గొన్నారు.

వాళ్లొస్తే మా పరిస్థితి ఏంటి?



- కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ రాజు వస్తున్నట్లు పుకార్లు
- పార్టీలో తమ ప్రాధాన్యం తగ్గుతుందనే ఆందోళనలో హస్తం నేతలు
- చర్చనీయాంశంగా మారిన కాంగ్రెస్ ముఖ్య నేతల రహస్య భేటీ
- రసవత్తరంగా మారిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రాజకీయం

కుత్బుల్లాపూర్: ఒకవైపు ఎమ్మెల్సీ.. మరోవైపు ఎమ్మెల్యే.. కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని.. ఇంకోవైపు పార్టీకి పనిచేస్తూ వస్తున్న తమ పరిస్థితి ఏమిటని.? కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రహస్యంగా సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చించుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మెజార్టీ ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించిన వారే ఉండటం... అందులో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఒకరైతే.. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన విషయం తెలిసిందే.

ఓ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేతో చర్చలు...

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాడని పుకార్ల షికార్లు చేయడం చర్చగా మారింది. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఇద్దరు కలిసి ఎమ్మెల్సీ రాజును కాంగ్రెస్ పార్టీలో చేరేలా చర్చలు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు సమావేశం కావడం కూడా అనుమానాలకు బలం చేకూరుతోంది.

నిజాంపేట మేయర్, కార్పొరేటర్లు సైతం..

ఇదే క్రమంలో నిజాంపేట్ మేయర్ నీలా గోపాల్ రెడ్డితో పాటు మెజార్టీ కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీకి సంబంధించిన ఏడుగురు కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లో భారీగా చేరికలు జరిగే అవకాశాలు ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

వాళ్లొస్తే మా పరిస్థితి ఏమిటనే సందిగ్ధంలో హస్తం నేతలు

ఈ నేపథ్యంలో సోమవారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతి రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, బండి శ్యామ్‌గౌడ్, బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్ కుమార్, జిమ్మీ దేవేందర్, నిజాంపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, నవీన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు రహస్యంగా భేటీ కావడం రాజకీయంగా చర్చనీయాంశం అయ్యింది. ఈ ఇద్దరు నేతలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే తమ పరిస్థితి ఏమిటని.. ద్వితీయ శ్రేణి నాయకులు ఆందోళన చెందుతున్నారు.

వస్తే కలిసి పనిచేసే ప్రసక్తే లేదు..



ఈ సమావేశంలో వారు ప్రధానంగా ఈ అంశాలపై చర్చించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండగా తమపై అక్రమంగా కేసులు పెట్టారని.. అప్పట్లో తాము రాజకీయంగా వాటిని ఎదుర్కొంటూ వచ్చామని.. ఇప్పుడు వారితో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని సమావేశంలో చర్చించుకున్నట్లు తెలిసింది.

నేడు బీజేపీ బూత్‌స్థాయి సమావేశం

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 2వ తేదీన సాయంత్రం 5గంటలకు షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ ఫంక్షన్‌హాల్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లతో పాటు రాష్ట్ర నాయకులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, బూత్‌స్థాయి అధ్యక్షులు, సభ్యులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరాయి.

స్థానిక సమస్యలపై ఏకరవు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో పలు ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి స్థానిక సమస్యలపై ఏకరవు పెట్టారు. దీనిపై స్పందించిన రాజు సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రామదేవతలను ఆరాధించడం మన సంప్రదాయం


పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: గ్రామదేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాల్లో భాగమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీలోని శ్రీపోచమ్మ అమ్మవారి నూతన విగ్రహ పునః ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠాపనలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి పూజ, శాంతిహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాల్లో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, ఎమ్మెల్యే వివేకానందలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామదేవతలు స్థానిక ప్రజలకు రక్షణగా ఉంటారని అన్నారు. వారిని పూజిస్తే అందరికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, కాలనీ ప్రెసిడెంట్ రియాజ్, ప్రధాన కార్యదర్శి మల్లం శ్రీనివాస్‌గౌడ్, బాలునేత, శ్రీధర్, సుజాత, శశి నరసింహగౌడ్, మారుతినగర్ అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీభద్రకాళి సహిత వీరభద్ర స్వామి, కాలభైరవ సహిత నవగ్రహ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే వివేకానంద హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు మూల బసవరాజ్, కళ్యాణ్‌రావు, రాజప్ప, రాజయ్య స్వామి, రామయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోగా వసంతకుమారి


ఎంఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న వసంతకుమారి

దుండిగల్: కుత్బుల్లాపూర్ ఉమ్మడి మండల విద్యాశాఖ అధికారిగా జె.వసంత కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవోగా పని చేసిన ఆంజనేయులు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో తూంకుంట జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్న వసంతకుమారి ఇక్కడికి బదిలీపై వచ్చింది. ఆమె మేడ్చల్ జిల్లాలోనే 8 మండలాలకు విద్యాశాఖ అధికారిగా పని చేస్తుండగా ఇక్కడ ఇంచార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తానని వసంతకుమారి తెలిపారు.

వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జైరామ్‌నగర్‌లో వీరాంజనేయస్వామి, కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త ముద్దాపురం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఉజ్వల మహిళా మండలి అధ్యక్షురాలు కృష్ణవేణి, రాధా, సతీష్, కవిత, శివకుమార్, హర్షిత, రావిగౌడ్, రామలక్ష్మి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు వివరాల కోసం..

కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ 1950


కలెక్టర్ గౌతమ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఓటరు వివరాల కోసం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో టోల్ ఫ్రీ నంబర్ '1950'ఏర్పాటు చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.ఈ కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది, పోలింగ్ స్టేషన్ల నంబర్లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటరు వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫారం 6, 7, 8 లపై సంక్షిప్త సమాచారం, ఓటర్ ఐడీ, పోలింగ్ స్టేషన్, ఎపిక్ కార్డు , ఏఆర్‌ఓ, ఈఆర్ ఓ ,బీఎల్‌ఓ, సూపర్‌వైజర్ల తదితర వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఘనంగా నార్త్‌సిటీ హైస్కూల్ వార్షికోత్సవం


డ్యాన్స్‌లు చేస్తున్న సూరారం నార్త్ సిటీ హైస్కూల్ విద్యార్థులు

సుభాష్‌నగర్: సూరారం నార్త్‌సిటీ హైస్కూల్ 23వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ రవీందర్ ముదిరాజ్,టీఎస్‌ఆర్‌ఎస్‌ఎంఏ ప్రెసిడెంట్ రామేశ్వర్‌రెడ్డి, సభ్యులు ఆంజనేయులు, వినోద్‌జాదవ్, దయాకర్, భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి లోక్‌సభలో బీజేపీ జెండా ఎగురవేయాలి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో బీజేపీ జెండా ఎగురవేసి ప్రధాని నరేంద్రమోదీకి బహుమతిగా ఇస్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో శ్రీశైలంగౌడ్ విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోకవర్గ బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఎంజే గార్డెన్‌లో ఉంటుందన్నారు. సాయంత్రం 5గంటలకు జరిగే సమావేశానికి బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో పాటు రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని కై వసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహ్యాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తామన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని శ్రీశైలంగౌడ్ కోరారు.

నియామకం

నిజాంపేట్: మున్నూరు కాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా కొడారి వెంకటేష్ పటేల్ నియమితులయ్యారు. సోమవారం రాష్ట్ర సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్, ఉపాధ్యక్షుడు జల్లిపల్లి వెంకటేశ్వర్లు, గ్రేటర్ అధ్యక్షుడు మహేందర్‌ల చేతుల మీదుగా వెంకటేష్ పటేల్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపు కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ దేశెట్టి శివపటేల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ..

వ్యక్తికి తీవ్ర గాయాలు

సుభాష్‌నగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం ప్రాంతానికి చెందిన ఓజాల్(50) గత నెల 31వ తేదిన స్కూటీపై కొమరివెల్లికి వెళ్తున్న ఓజాల్‌ను సూరారం కట్టమైసమ్మ ఆలయం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో అతని కాలు విరిగిపోగా, శరీరంపై బలమైన గాయలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

నిజాంపేట్: వాటర్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌కు చెందిన రాజు సూరారం జలమండలి కార్యాలయంలో ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళ్తున్న రాజును బాచుపల్లిలోని ఉల్లాస్ దాబా సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా ప్రమాదం

- నుజ్జునుజ్జయిన వ్యక్తి కాలు
- పోలీసుల అదుపులో డ్రైవర్


టాటా ఏసీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ

సుభాష్‌నగర్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన బాలకృష్ణ (39) సోమవారం ఉదయం సూరారం ప్రధాన రోడ్డు శివాలయం నగర్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో షాపూర్‌నగర్ నుంచి గండిమైసమ్మరే వెళ్తున్న (టీఎస్ 08 యుజె 2592) టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. దీంతో బాలకృష్ణ కుడికాలు నుజ్జునుజ్జు అయింది. విషయం తెలుసుకున్న సూరారం పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అనిల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా బాలకృష్ణ కుడి కాలును వైద్యులు తొలగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలు.. వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్: కుటుంబ కలహాలతో మధ్య గొడవతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం రాజీవ్‌గృహకల్పకు చెందిన దత్తా(30) సోమవారం ఉదయం 4.30 గంటలకు తన భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం చేతి మణికట్టు వద్ద కోసుకుని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసుల సహాయంతో తలుపులు బద్దల కొట్టి లోనికి వెళ్లి చూడగా అప్పటికే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతన్ని కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా నెల రోజులుగా తమ కుమారుడు మానసికస్థితి సరిగా లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలను బెదిరిస్తున్నారని కార్పొరేటర్ ఫిర్యాదు

నిజాంపేట్: బీఆర్‌ఎస్ నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నరంటూ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ బాలాజీ నాయక్ సోమవారం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం దుర్వినియోగం చేస్తూ తాను అనుకున్న వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై పలుమార్లు తాము నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌కు బెదిరింపులకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశామన్నారు. తమ పార్టీ నాయకుల మీద నిరాధార ఆరోపణలు చేసి ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ ఆదివారం ఆకుల సతీష్ ప్రభుత్వ (ఆర్‌ఎన్‌ఐ) అనుమతులు లేకుండా ఇష్టానూసారంగా ఎలాంటి ఆధారాలు లేకుండా కథనాలు ప్రచురిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడిన ఓ వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో సోమవారం కార్పొరేటర్ బాలాజీనాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చర్చనీయాంశం అయ్యింది.

సార్వత్రిక సమరం..

సిబ్బంది సిద్ధం

లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ఈసీ ప్రత్యేక దృష్టి

- ఓటర్ల నమోదు మొదలు నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకూ సిబ్బంది పాత్రే కీలకం
- రిటర్నింగ్ అధికారికి సహా సహాయ అధికారులు నియామకం



సాక్షి,మేడ్చల్ జిల్లా: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్(ఈసీ) ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఓటరు నమోదు మొదలు అభ్యర్థుల నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి ఘట్టంలోనూ అధికారులు, ఎన్నికల సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తారు. వీరి ఎంపిక ప్రక్రియను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు... జిల్లా అధికార యంత్రాంగం కొన్నినెలల ముందే ప్రారంభించింది. ఎన్నికల సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా ఇటీవల కలెక్టర్ గౌతమ్ పూర్తిచేశారు.

మల్కాజిగిరి ఆర్‌ఓగా కలెక్టర్

శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)ని నియమిస్తోంది. ప్రతి లోక్‌సభ స్థానానికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఆర్‌ఓగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆర్‌ఓగా వ్యవహరిస్తారు. నామినేషన్ ప్రక్రియ, అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన, పోలింగ్ సిబ్బంది నియామకం– శిక్షణ, ఈవీఎంల ర్యాండమైజేషన్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వంటి అంశాలన్నీ ఆర్‌ఓ పర్యవేక్షణలో జరుగుతాయి.

సహాయ రిటర్నింగ్ అధికారులుగా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ఆర్‌ఓను ఎన్నికల సంఘం నియమించింది. అలాంటి వారందరూ లోక్‌సభ ఎన్నికల సమయంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించిన ఐదుగురు ఆర్‌ఓలు... ఈ లోక్‌సభ ఎన్నికల సమయంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓకు వారు సహకరించటంతో పాటు సంబంధిత శాసనసభ నియోజకవర్గాల పరిధిలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటారు. అయితే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఏడుగురు ఆర్‌ఓలు... ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఏఆర్‌ఓలుగా విధులు నిర్వహిస్తారు.

అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ కేంద్రాలు

మేడ్చల్	591
మల్కాజిగిరి	418
కుత్బుల్లాపూర్	592
కూకట్‌పల్లి	417
ఉప్పల్	407
ఎల్బీనగర్	571
కంటోన్మెంట్	232
మొత్తం	3,228

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం కానుంది. వీరి పరిధిలో 6 నుంచి 9 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, నీరు, విద్యుత్తు, ఫ్యాన్లు తదితర మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సెక్టోరియల్ అధికారులదే. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 313 సెక్టోరల్ అధికారులు విధులు నిర్వంచనున్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు సిబ్బంది

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓ ప్రిసైడింగ్ అధికారి(పీఓ)ని నియమిస్తారు. ఈవీఎంలు, వీవీప్యాట్లను పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి.. ఓటింగ్ అనంతరం వాటిని స్ట్రాంగ్ రూంకు చేర్చే వరకు పీఓ బాధ్యత వహిస్తారు. సహాయకారిగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. వీరితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తిస్తారు. ఒకరు ఓటర్లకు ఇంకు పూస్తారు. మరొకరు ఈవీఎంల పనితీరును పర్యవేక్షిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున సిబ్బందిని నియమిస్తూ... అదనంగా 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వు ఉంచేలా ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు.

◆ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి.